# పాదాక్రాంతం

ఎడిటర్ హడావిడిగా మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. వస్తూనే "తొందరగా అన్నం వడ్డించు. ప్రెస్‌మీట్‌కి వెళ్ళాలి" అన్నారు.

అన్నం తింటూన్న ఎడిటర్‌గార్ని అడిగింది భార్య "మా అన్నగారు రాసిన కథ చూశారా. ఎలా వుంది" అంది.

విసుగ్గా ఉన్న ఎడిటర్ "దీనికి ఒకవేళాపాళా లేదా" అని విసుక్కున్నారు.

కథ గురించి ఏమీచెప్పక పోయేసరికి, క్యాబేజీ "కూర ఎలా ఉంది" అని అడిగింది భార్య. భోజనానికి వచ్చేముందే చదివిన కథ బాగా లేకపోవడంతో ఎడిటర్ మనస్సంతా చికాగ్గా ఉంది! అదే విషయం భార్యతో చెప్పి, "తర్వాత మాట్లాడదాం' అన్నాడు.

"మీకు అనేకసార్లు చెప్పాను. భోజనానికి వచ్చేముందు చెత్త కథలు చదవవద్దు. అన్నం తినలేరని అయినా మీరు మానరు" అన్నది భార్య.

"చదవక ముందు, అసలు కథ ఎలా ఉంటుందో ఎలా తెలుస్తుంది! ఆ మాత్రం తెలివితేటలు నాకులేవా!" అనుకున్నాడు ఎడిటర్.

మొత్తం మీద భోజనం ముగించుకుని బయటపడ్డాడు, ఎడిటర్.

ఆ మర్నాడు మళ్ళీ భోజనం వేళ, తన అన్నయ్య రాసిన కథ గురించి నిలదీసింది భార్య. "ఆ కథ యిచ్చి రెండు నెలల అయింది! అసలు చూశారో లేదో తెలియదు! వేస్తారో లేదో తెలీదు! నన్నూ, నాపుట్టింటి వాళ్ళనీ యిలా ఎంతకాలం బాధపెడతారు!"

"నువ్వే కదా భోజనం ముందు చెత్త కథ చదవొద్దు అన్నావు"

"అంటే మా అన్నయ్య రాసినది చెత్త కథా! మేము చెత్త రాయం, మాది పండిత కుటుంబం" అంది భార్య, ఉక్రోషంతో.

"అదే నా భయం! మీ వాళ్ళు పండిత పుత్రులని! ఏది, ఎక్కడ, ఎప్పుడు వెయ్యాలో మాకు బాగా తెలుసు. కాలం సమీపిస్తే, అదే పడుతుంది" అన్నారు ఎడిటర్ నర్మగర్భంగా.

"దానంతటి అదే పడాలిగానీ మీరు మాత్రం వెయ్యరన్నమాట!" అంది భార్య.

తర్వాత ఒకనెల రోజులకి, బావమరిది తను రాసిన కథ విషయం తేల్చుకుందామని స్వయంగా హైదరాబాద్ వచ్చాడు.

తన కథ ఎంతవరకు వచ్చిందని చెల్లెల్ని అడిగాడు "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది" అని చెప్పింది చెల్లి.

మళ్ళీ ఎడిటర్ భోజనానికి వచ్చినప్పుడు ఆ కథ గురించి యింట్లో పోరు. ఎడిటర్‌కి కోపం వచ్చి "భోజనం తొందరగా చేసేద్దామని , ఆ పెరుగు వడ్డించేయి, వెళ్లిపోతాను" అన్నారు.

"ఆ కథ వేసేవరకూ యింక పెరుగు వెయ్యను, యిదుగో మజ్జిగ పోసుకోండి!" అని చాటుగా నిలబడి చూస్తున్న అన్నయ్యకేసి చూసింది, "ఎలా ఉంది మన ప్రతాపం" అన్నట్లు!

ఎడిటర్, కోపంగా, "యింటిలోని పోరు యింతింకాదయా" అని, వేమన పద్యం గట్టిగా చదువుకుంటూ బయటికి వెళ్ళిపోయారు.

"చూడవే చెల్లీ! నువ్వు చెవులోని జోరీగ! నేను చెప్పులోని రాయినీ కాబోలు!" అని, చెల్లికి సద్భోధ చేశాడు అన్నగారు.

సాయంకాలం ఇంటికి వచ్చిన తర్వాత తోబుట్టువులు తగులుకున్నారు, ఆ కథ గురించి.

"ఈ పత్రిక" ప్రియబంధుమిత్ర జనావళీ పత్రిక కాదనీ, పైగా అది ఎంతోమదికి జీవనోపాధి" అని ఎడిటర్ ఖచ్చితంగా చెప్పారు.

పట్టుదలలు పెరిగాయి! ఒకరోజు ఎడిటర్ బావమరిది పత్రికా కార్యాలయానికి వెళ్ళాడు అక్కడ తన బావగారు చాలా విసుగ్గా కనిపించారు" తను రచయిత! రచయితికి స్వేచ్ఛ ఉంటుంది కదా!" అని ఎడిటర్‌ని తన గురించి నిలదీశాడు బావమరిది.

"నువ్వు స్వయంగా రావాలటయ్యా! ఈరోజు వస్తూనే, వేసేశాను" అన్నాడు ఎడిటర్.

"ఒక్కసారి చూస్తాను. ఏమైనా తప్పులున్నాయేమో" అన్నాడు బావమరిది.

"తప్పులూ, మంచీ, చెడూ చూడ్డానికే కదా మేము ఉన్నది" అన్నారు ఎడిటర్.

"అయినా చూస్తాను" అన్నాడు బావమరిది. ఎడిటర్‌కి చూపించక తప్పలేదు.

డైరెక్ట్‌గా చూపలేక, ఒక రూపాయి బిళ్ల కావాలని తన టేబుల్ క్రింద పడేసి "చూద్దువుగాని, ఆ రూపాయి తీసి ఇవ్వు" అన్నాడు, బావమరిదితో.

రూపాయి తీసి యిద్దామని కిందకు వంగిన బావమరిదికి, తను రాసిన "పాదాక్రాంతం" కథ ఎడిటర్‌గారి టేబుల్ కింద ఉన్న బుట్టలో కనిపించిది! విసిగిపోయిన ఎడిటర్‌గారికి ఆ కథ ఎక్కడో అక్కడ వెయ్యక తప్పలేదు.

"ఈరోజు పొద్దున్నే వేస్తాను" అంటే "పత్రికలో వేసేస్తాను అన్నాడని అనుకున్న బావమరిదికి, ఎడిటర్‌గారి పాదాక్రాంతమయిన తన కథను చూసి కళ్లనీళ్ళ పర్యంతమయింది.

ఇంటికి వెళ్లి, తన చెల్లెలితో జరిగిన కథ చెప్పాడు.

"ఆ అంతపని చేసారా! యింటికి రానీ, చెప్తాను" అంది చెల్లి.

ఎడిటర్‌గారు మాత్రం తక్కువ తిన్నారా! అసలు పది రోజులు యింటికే రాలేదు! ప్రశాంతంగా హొటల్లో గడిపారు.

(చతుర, ఫిబ్రవరి 2005)